www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

సోమవారం ఏప్రిల్ 27 2026

ninadam.in



### అమెరికా అధ్యక్షుడిపై కాల్పుల ఘటన

## భద్రతపై ఉలిక్కి పడేలా చేసిన వ్యక్తి

- ట్రంప్‌పై వ్యతిరేతతోనే దాడికి యత్నం
- నోట్ ద్వారా ప్లాన్ వెల్లడించిన దాడి నిందితుడు

**వాషింగ్టన్,ఏప్రిల్ 27( నినాదం):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న శ్వేతసౌధం కరస్పాండెంట్స్ డిన్నర్‌లో కాల్పుల ఘటన నిందితుడు కోల్ టొమాస్ అలెన్ గురించి కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. అతడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా దాడికి ముందే ఓ నోట్‌ను తయారుచేసి, దానిని కుటుంబసభ్యులకు పంపాడు. ట్రంప్ గురించి....పిల్లలను లైంగికంగా వేధించే వ్యక్తి, రేపిస్ట్, ద్రోహి వంటి పదాలను అందులో వాడాడని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అలాంటి లక్షణాలున్న వ్యక్తిని ఏమాత్రం అంగీకరించను అని ఆ నోట్‌లో నిందితుడు రాసుకున్నాడు.

## నేను రేపిస్టును కాదు.. 'మీరు భయంకరమైన వాళ్లు'..

- వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్‌పై దాడికి యత్నించిన వ్యక్తి ఉదంతం
- దాడికి పాల్పడిన వ్యక్తి మేనిఫెస్టోను చదివిన రిపోర్టర్‌పై ట్రంప్ ఫైర్
- 'మీరు భయంకరమైన వ్యక్తులు' అంటూ జర్నలిస్టులపై తీవ్ర ఆగ్రహం

02





## ఎమ్మెల్సీలుగా కోదండరామ్,అజారుద్దీన్ ప్రమాణం

- ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా
- హాజరైన సిఎం రేవంత్ తదిరులు

**హైదరాబాద్,ఏప్రిల్27( నినాదం):** ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ

02

# పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ప్రాంగణ అభివృద్ధి

### ఛైర్మన్, స్పీకర్‌తో కలిసి సిఎం రేవంత్ పనుల సమీక్ష



**హైదరాబాద్,ఏప్రిల్27( నినాదం):** అసెంబ్లీ ప్రాంగణాన్ని పార్లమెంటు తరహాలో అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన పనులకు సంబంధించి ముఖ్యమంత్రి అనుముల రేవంత్ అధికారులకు పలు సూచనలు చేశారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌లతో కలిసి ముఖ్యమంత్రి, అసెంబ్లీ ప్రాంగణంలో చేపట్టాల్సిన పనులను సమీక్షించారు. సభ్యుల గౌరవాన్ని ఇనుమడింపజేసేలా ప్రాంగణంలో అవసరమైన మార్పులు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. గతంలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా, తదుపరి సమావేశాల నాటికి సభ్యుల కోసం 'సెంట్రల్ హాల్'ను పార్లమెంటు తరహాలో సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. సభ్యుల కోసం ఒక ప్రత్యేక 'సభ్యుల క్లబ్'ను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రస్తుత అసెంబ్లీ మరియు పాత మండలి భవనాల చారిత్రక విలువకు ఎటువంటి భంగం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సభ్యుల కోసం వాకింగ్ ట్రాక్ మరియు క్రీడా సదుపాయాల వంటి ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని ఆయన సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు కూడా ఆయన పలు సూచనలు చేశారు.

## బీఆర్ఎస్ ఓ 'చచ్చిన శవం'..

### కవిత పార్టీ అవసరమే లేదు..

- చచ్చిన శవానికి ఎంత అలంకరణ చేసినా వేస్ట్ అన్న రేవంత్
- రాష్ట్రంలో కొత్త పార్టీ అవసరమే లేదని వ్యాఖ్య
- బీఆర్ఎస్ ఉంటుందో, ఊడుతుందో అని ఎద్దేవా

**హైదరాబాద్,ఏప్రిల్27( నినాదం):** కొత్త ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని ఆయన అన్నారు. "చనిపోయిన శవానికి ఎంత అలంకరణ చేసినా ప్రయోజనం ఉండదు.. బీఆర్ఎస్

02

### ఏడుగురు ఆప్ ఎంపీల

## విలీనానికి రాజముద్ర

- వీరంతా బిజెపిలో చేరినట్లుగా గుర్తించిన చైర్మన్
- రాజ్యసభలో 113 కు చేరిన బిజెపి సంఖ్యాబలం



**న్యూఢిల్లీ,ఏప్రిల్27( నినాదం):** ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమవ్వడానికి రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాజ్యసభలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ విలీనంతో బీజేపీ సంఖ్యాబలం 113కి పెరిగింది. ఆప్ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆప్ నుంచి రాఘవ్ చద్దా, సాందీప్ పాఠక్, అశోక్ మిట్టల్,

02

## బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

- 29న రెండో విడత ఎన్నికలు
- బిజెపి అధికారంలోకి వస్తున్న మోడీ
- మళ్లీ సిఎం ప్రమాణానికి వస్తానంటూ వెల్లడి



**కోల్‌కతా,ఏప్రిల్27( నినాదం):** బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం ముగిసింది. 29న రెండోవిడత ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో 27న సాయంత్రం ప్రచారం ముగిసింది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. ఈ క్రమంలో ప్రధాని మోడీ ప్రచారం ముగిసంది. భాజపా అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో

02



## ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం మరింత వేగవంతం

### అర్హులైన దరఖాస్తుదారులు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకుంటే గృహాలు పొందవచ్చు

**జిల్లా కలెక్టర్లకు మరిన్ని అధికారాలు, గృహ నిర్మాణ మంజూరు నిరంతర ప్రక్రియ**

- అవిభక్త జిల్లాలకు ప్రత్యేక అధికారులు
- ఆర్డీఓల ద్వారా సదా బైనామాలపై తుది నిర్ణయం
- తహశీల్దార్ కార్యాలయాలకు కొత్త భవనాలు
- ప్రతి జిల్లా కేంద్రంలో ఆధునిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు
- సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

*ప్రతిష్ఠాత్మకమైన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని వేగంగా, మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అధికారాలను వికేంద్రీకరించి, మరిన్ని బాధ్యతలు అప్పగిస్తోందని తెలిపారు. ఈ పథకానికి ప్రాధాన్యతనిస్తూ, జిల్లా గృహ నిర్మాణ అధికారులతో వారానికోసారి సమీక్షలు నిర్వహించాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో మెరుగైన సమన్వయం కోసం, క్షేత్రస్థాయిలో సమస్యలను నివారించడానికి ప్రతి అవిభక్త జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తామని తెలిపారు. అవిభక్త నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో గృహ, రెవెన్యూ విషయాలపై సోమవారం హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఇన్‌చార్జ్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గృహ నిర్మాణ అధికారులు హాజరయ్యారు.*

**హైదరాబాద్,ఏప్రిల్27( నినాదం):** నియోజకవర్గాల వారీగా సవివరంగా చర్చలు జరిగాయి. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై మంత్రి తక్షణమే స్పందిస్తూ, అవసరమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ గృహ పథకం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మంత్రి తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులని తేలితే వారికి ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధుల సూచనలను సముచితంగా పరిగణనలోకి తీసుకుంటామని, అమలు ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రాజకీయ పక్షపాతం లేకుండా ప్రతి నియోజకవ ర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేశామని, సకాలంలో నిర్మాణం జరిగేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యేలను ఆయన కోరారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేని లేదా నిర్మించుకోవడానికి ఇష్టపడని సందర్భాలలో, ఆ యూనిట్లను ఇతర అర్హులైన వ్యక్తులకు తిరిగి కేటాయించాలి. బేస్‌మెంట్ దశ పూర్తయిన వెంటనే, ముఖ్యంగా సాంకేతిక సమస్యల కారణంగా బిల్లుల చెల్లింపు ఆలస్యమైన చోట, బకాయి ఉన్న చెల్లింపులను తక్షణమే విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. పేదల సంక్షేమానికి సంబంధించిన విషయాలలో అధికారులు మానవతా దృక్పథాన్ని

02

### కోర్టుపై తనకు


## నమ్మకం పోయింది

- అందుకే మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,ఏప్రిల్27( నినాదం):** ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావడానికి ఆయన నిరాకరించారు. ఈ మేరకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ,

02



## ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్ మృతికి మోడీ సంతాపం

### క్రియేటివ్ దిగ్గజంగా గుర్తుండిపోతారని కితాబు

**న్యూఢిల్లీ,ఏప్రిల్27( నినాదం):** ప్రముఖ భారతీయ ఫోటో జర్నలిస్ట్ రఘు రాయ్ మృతికి ప్రధాని మోడీ సంతాపం ప్రకటించారు. ఆదివారం ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే.

02

## త్యాగాల పునాదులపై ఏర్పడ్డదే బిఆర్ఎస్

- 14 ఏళ్ల పోరాటంలో తెలంగాణను ఐక్యం చేసిన జెండా,
- ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,ఏప్రిల్27( నినాదం):** దశాబ్దాలుగా అన్యాయనికి గురై నెత్తురు మండిన జాతి ఎత్తిన జెండానే గులాబీ జెండా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జై కేసీఆర్, జైతెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..స్వీయ రాజకీయ శక్తిగా

02






## విశాఖలో ఘనంగా ప్రారంభమైన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుక

- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి.. హాజరైన సీఎం చంద్రబాబు
- పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, గవర్నర్లు, ప్రజాప్రతినిధుల హాజరు
- వేడుకల్లో పాల్గొన్న క్రికెట్ దిగ్గజం సచిన్, ఏయూ పూర్వ విద్యార్థి, సినీ దర్శకుడు త్రివిక్రమ్
- 25 వేల మందికి పైగా విద్యార్థులు, పూర్వ విద్యార్థులతో నిండిన ప్రాంగణం

02

### జనగణనతో

## సంక్షేమ పథకాలు ఆగవు..

- జనాభా గణనపై అపోహలు వద్దన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- గణాంకాలతో సంక్షేమ పథకాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని హామీ
- తెలంగాణలో ప్రారంభమైన దేశపు తొలి పూర్తి డిజిటల్ జనగణన
- మే 10 వరకు ఆన్‌లైన్‌లో స్వీయ నమోదుకు అవకాశం



**హైదరాబాద్,ఏప్రిల్27( నినాదం)** దేశాభివృద్ధికి జనాభా గణన అత్యంత కీలకమని, ప్రజలు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా తమ వివరాలను నమోదు చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. జనాభా గణనలో సరైన వివరాలు ఇస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయనే ప్రచారాన్ని నమ్మవద్దని, ప్రజలు ఇచ్చే ప్రతి సమాచారం అత్యంత గోప్యంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లో నిన్న తన వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, 2027 జనాభా గణన 'స్వీయ నమోదు' (సెల్ఫ్ ఎన్యూమరేషన్) ప్రక్రియను కిషన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మాకు ఇల్లు

02

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

02

డిజిటల్ ఎడిషన్

సోమవారం ఏప్రిల్ 27 2026

ninadam.in


## ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్ మృతికి మోడీ సంతాపం

క్యాన్సర్ మహమ్మారితో పాటు వృద్ధాప్య సంబంధిత సమస్యల కారణంగా 83 ఏళ్ల వయసులో ఆయన ప్రాణాలు కోల్పోయారు. రఘు రాయ్ మరణంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయనకు నివాళులర్పించారు. రఘు రాయ్ భారతదేశ జీవనశైలిని తన కెమెరా ద్వారా అద్భుతంగా బంధించిన క్రియేటివ్ దిగ్గజంగా గుర్తుండిపోతారని ప్రధాని పేర్కొన్నారు. మోదీ తన పోస్టులో..పేర్కొన్నారు. రఘు రాయ్ ఫోటోగ్రఫీలో అసాధారణమైన సున్నితత్వం, వైవిధ్యం ఉండేవి. ఆయన ఫోటోగ్రఫీ భారతదేశంలోని వివిధ జీవన పార్శ్వాలను ప్రజలకు చేరువ చేసింది. రఘు రాయ్ మరణం ఫోటోగ్రఫీ, సాంస్కృతిక ప్రపంచానికి తీరని లోటు. ఈ విషాదకర సమయంలో నా ఆలోచనలు ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన వారితో ఉన్నాయి. ఓం శాంతి' అని రాసుకొచ్చారు. రఘు రాయ్ 1942లో పంజాబ్‌లోని ఝంగ్‌లో జన్మించారు. సివిల్ ఇంజినీరింగ్ చేసిన ఆయన 23 ఏళ్ల వయసులోనే ఫోటోగ్రఫీ వైపు వచ్చారు. 'ద స్టేట్స్‌మన్' వార్తా పత్రికలో ఫోటోగ్రాఫర్‌గా చేరారు. దాదాపు 60 ఏళ్ల పాటు ఫోటోగ్రాఫర్‌గా కొనసాగారు. ఎన్నో అద్భుతమైన చిత్రాలను ఆయన తీశారు. దేశంలో చోటుచేసుకున్న ఎన్నో ముఖ్య ఘట్టాలను, విషాదాలను తన కెమెరాతో బంధించారు. దలైలామా, మదర్ థెరీసా, సత్యజిత్ రే, హరి ప్రసాద్ చౌరాసియా, బిస్మిల్లా ఖాన్ వంటి ప్రముఖుల జీవితాల్లోని అరుదైన కోణాలను కెమెరాతో స్పృశించారు.

## ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం మరింత వేగవంతం

అవలంబించాలని ఆయన నొక్కి చెప్పారు. గత ప్రభుత్వం నిర్మించి, గతంలో అసంపూర్తిగా ఉన్న డబుల్-బెడ్‌రూమ్ గృహ యూనిట్లను పూర్తి చేయాలని, వాటితో పాటు తాగునీరు, విద్యుత్, మురుగునీటి పారుదల వంటి ప్రాథమిక సౌకర్యాలను కల్పించాలని, నిర్మాణ దశతో సంబంధం లేకుండా లబ్ధిదారులకు తక్షణమే కేటాయించాలని మంత్రి ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో భూమి కొరతను దృష్టిలో ఉంచుకుని, జీ+1 నమూనా కింద 400 నుంచి 600 చదరపు అడుగుల మధ్య ఇళ్లను నిర్మించుకోవడానికి వెసులుబాటు కల్పించబడింది. సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం సమగ్ర భూ సర్వేలు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారాలను అందిస్తాయని మంత్రి నొక్కి చెప్పారు. దీనిలో భాగంగా, ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్టులు కొనసాగుతున్నాయి. అక్కడ సర్వే మ్యాపుల ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి, రిజిస్ట్రేషన్ అనంతరం సర్వే మ్యాప్ నంబర్లు, భూధార్ నంబర్లు కేటాయించబడతాయి. సదా బైనామాల విషయానికి వస్తే, దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించబడతాయని, కొనుగోలుదారుడి నుండి ఒక డిక్లరేషన్ ఇస్తే సరిపోతుందని ఆయన అన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి, నిర్ణయాధికారాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారులకు (ఆర్డీఓలకు) అప్పగించారు. శిథిలావస్థలో ఉన్న తహశీల్దార్ కార్యాలయాలతో మొదలుపెట్టి, రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా కొత్త తహశీల్దార్ కార్యాలయ భవనాలను నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తామని, ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించామని తెలిపారు. రెవెన్యూ, అటవీ, దేవాదాయ, వక్ఫ్ శాఖల మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారాలను అందించేందుకు సంయుక్త సర్వేలు నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ఈ సమావేశానికి నిజామాబాద్ ఇన్‌చార్జి మంత్రి దాసరి అనసూయ సీతక్క, జూపల్లికృష్ణారావు జి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, మహ్మద్ షబ్బీర్ అలీ, సంబంధిత జిల్లా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, గృహ నిర్మాణ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు హాజరయ్యారు.

## అమెరికా అధ్యక్షుడిపై కాల్పుల ఘటన
## భద్రతపై ఉలిక్కి పడేలా చేసిన వ్యక్తి

తాను ఎవరిని టార్గెట్ చేయాలను కున్నాడో ఒక జాబితాను సిద్ధం చేసుకున్నాడు. తన జోలికి రానంతవరకు అతిథులు, ఇతర సిబ్బందిని, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లపైనా కాల్పులు జరపనని పేర్కొన్నాడు. అలాగే హోటల్ భద్రత ఘోరంగా ఉందని, తాను భారీ రైఫిల్‌ను తెచ్చినా ఎవరూ గుర్తించేవారు కాదంటూ నిందితుడు వ్యాఖ్యా నించాడు. ఇక కాల్పుల ఘటన అనంతరం అధ్యక్షుడు మీడియాతో మాట్లాడుతూ.. నోట్‌లో ఉన్న ఆరోపణలను తోసిపుచ్చారు. నిందితుడు రాసుకున్నది మీ గురించే అని భావిస్తున్నారా..? అని మీడియా అడిగిన ప్రశ్నకు ట్రంప్ స్పందించారు. అతడే దానిని రాసుకున్నాడు. కానీ నేను రేపిస్ట్‌ని కాను. ఏమాత్రం సంబంధం లేనివాటిని నాకు ముడిపెట్టారు. నేను నిర్దోషిని అంటూ తనను ప్రశ్నించిన రిపోర్టర్‌పై అసహనం వ్యక్తంచేశారు. ప్రస్తుతం నిందితుడు రాసుకున్న అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ట్రంప్ యంత్రాంగంలోని అధికారులను లక్ష్యంగా చేసుకోవాలని అతడు ప్రయత్నించినట్లు వెల్లడవుతోందని అధికారులు పేర్కొన్నారు. ఇకపోతే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం జరిగింది. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో త్రుటిలో ఆయన, సతీమణి మెలనియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ దంపతులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. తుపాకులు, కత్తులతో వచ్చిన ఆగంతుకుడు 'శ్వేతసౌధం విలేకరుల సంఘం' విందు జరుగుతున్న హోటల్‌లోని బాల్‌రూంవైపు వెళ్తూ కాల్పులకు దిగడంతో ఒక్కసారిగా భీతావహ వాతావరణం నెలకొంది. ట్రంప్‌ను రక్షించడానికి సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు ఆగమేఘాలపై స్పందించగా.. కాల్పుల చప్పుళ్లు వినగానే ప్రాణభయంతో పలువురు అతిథులు టేబుళ్ల కింద దాక్కోవాల్సి వచ్చింది. నిందితుడు కోల్ టొమాస్ అలెన్‌ను (31) అక్కడికక్కడే నిర్బంధంలో తీసుకుని సంకెళ్లు వేశారు. అతడి వద్ద ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఉలిక్కి పడేలా చేసింది. ఘటన తర్వాత కూడా విందు కొనసాగించాలని ట్రంప్ గట్టిగా భావించినా.. భద్రతాధికారులు ఆ ప్రాంగణాన్ని తక్షణం ఖాళీ చేయడమే మేలని సూచించి ఆయనను శ్వేతసౌధానికి తరలించారు. ట్రంప్‌పై దాడికి ప్రయత్నించడం రెండేళ్లలో ఇది మూడోసారి.

### నేను రేపిస్టును కాదు.. 'మీరు భయంకరమైన వాళ్లు'..

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మీడియాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్‌పై దాడికి యత్నించిన వ్యక్తి మేనిఫెస్టోలోని అంశాలను ప్రస్తావించిన ఓ మహిళా రిపోర్టర్‌పై ఆయన విరుచుకుపడ్డారు. జర్నలిస్టులను భయంకరమైన వ్యక్తులు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం రాత్రి ట్రంప్ హాజరైన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ వేదిక వద్ద కాలిఫోర్నియాకు చెందిన కోల్ థామస్ అలెన్ (31) అనే వ్యక్తి భద్రతను ఛేదించుకుని లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. పలు తుపాకులు, కత్తులతో వచ్చిన అతను, ఈవెంట్ జరుగుతున్న బాల్‌రూమ్‌కు కొద్ది మీటర్ల దూరంలోనే కాల్పులకు తెగబడ్డాడు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఆదివారం సీబీఎస్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మొదట సంయమనంతోనే మాట్లాడారు. అయితే, రిపోర్టర్ నోరా ఓ'డొన్నెల్.. దాడి చేసిన వ్యక్తి మేనిఫెస్టోలోని ఒక వాక్యాన్ని చదివి వినిపించారు. "ఒక పీడోఫైల్, రేపిస్ట్, దేశద్రోహి చేసే నేరాలతో నా చేతులు మురికి కావడం ఇకపై నాకు ఇష్టం లేదు" అని అలెన్ తన మేనిఫెస్టోలో రాసినట్టు ఆమె పేర్కొన్నారు. ఆ వాక్యం వినగానే ట్రంప్ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. "మీరు ఆ వాక్యం చదువుతారని నాకు తెలుసు. ఎందుకంటే మీరు భయంకరమైన వ్యక్తులు" అని మండిపడ్డారు. "అవును, అతను అలా రాశాడు. కానీ నేను రేపిస్ట్‌ను కాదు. నేను ఎవరినీ రేప్ చేయలేదు. నేను పీడోఫైల్‌ను కూడా కాదు" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రిపోర్టర్ మధ్యలో కల్పించుకోబోయినా ఆయన ఆగలేదు. "ఒక అనారోగ్యంతో ఉన్న వ్యక్తి రాసిన చెత్తను మీరు చదివి వినిపిస్తారా? నాతో ఏమాత్రం సంబంధం లేని విషయాలతో నన్ను ముడిపెట్టారు. ఈ విషయంలో నేను పూర్తిగా నిర్దోషిగా తేలాను. ఇలాంటివి చదవడానికి మీకు సిగ్గుండాలి" అని ట్రంప్ నిప్పులు చెరిగారు. దాడి చేసిన వ్యక్తి రాడికల్ భావజాలం ఉన్నవాడని, ఒకప్పుడు క్రైస్తవుడైనా ఇప్పుడు యాంటీ-క్రిస్టియన్‌గా మారాడని, అతను మానసికంగా బలహీనుడని ట్రంప్ అభిప్రాయపడ్డారు. అమెరికాలో రాజకీయ హింసకు డెమొక్రటిక్ నేతల ద్వేషపూరిత ప్రసంగాలే కారణమని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు.

## ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజముద్ర

హర్భజన్ సింగ్, స్వాతీ మాలివాల్ సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విలీనానికి రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం తెలపడంతో వారంతా బీజేపీ సభ్యులయ్యారు. విలీనం తర్వాత తమను బీజేపీ ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురూ రాజ్యసభ ఛైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. దానికి తాజాగా ఆమోదం లభించింది. కాగా, తమ పార్టీ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది. కేంద్ర సంస్థలను ఉపయోగించి తమ నాయకులను ఒత్తిడి చేసి బీజేపీలోకి చేర్చుకున్నారని ఆరోపించింది. ఈ అంశంపై చట్టపరమైన పోరాటం కూడా కొనసాగుతుందని తెలిపింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు ఇటీవల బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ విలీన ప్రక్రియను సోమవారం రాజ్యసభ ఛైర్మెన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది.

ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలం ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువ అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ ఛైర్మెన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య ఛైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే.

## గద్వాల మార్కెట్ యార్డ్‌లో ఎంపీ డీకే అరుణ ఆగ్రహం


ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరించిందన్న డీకే అరుణ

రైతులు క్వింటాల్‌కు రూ. 700 నుంచి రూ. 800 వరకు నష్టపోతున్నారని ఆవేదన

రైతులు 15 రోజులుగా మార్కెట్ యార్డుల్లోనే పడిగాపులు కాస్తున్నారని వ్యాఖ్య

హైదరాబాద్ ఏప్రిల్ 27 (నినాదం) :

మొక్కజొన్న రైతులు పడుతున్న ఇబ్బందులపై బీజేపీ ఎంపీ డీకే అరుణ గద్వాల మార్కెట్ యార్డ్‌లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక లేకుండా వ్యవహరించడం వల్లే రైతులు క్వింటాల్‌కు రూ. 700 నుంచి రూ. 800 వరకు నష్టపోతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్నకు ఎంఎస్పీ (MSP) ధర రూ. 2,400 ఉన్నప్పటికీ, కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో సుమారు 2.70 లక్షల క్వింటాళ్ల పంట పండినా, మార్కెట్ యార్డుల్లో సంచులు, హమాలీలు, లారీల కొరత వల్ల కొనుగోలు ప్రక్రియ స్తంభించిందని విమర్శించారు. రైతులు 15 రోజులుగా మార్కెట్‌లోనే పడిగాపులు కాస్తున్నారని, కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడం దురదృష్టకరమని మండిపడ్డారు. మల్దకల్, గట్టు మండలాల్లో తక్షణమే అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఫోన్ ద్వారా కోరారు.



## ఏపీలో ఇంధన కొరతపై చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

- క్షేత్రస్థాయిలో సరఫరాను పర్యవేక్షించాలని కలెక్టర్లకు ఆదేశం
- ప్రతీ 3 గంటలకు నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులకు సూచన
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



అమరావతి, ఏప్రిల్ 27 (నినాదం):

రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు ఆయన సోమవారం నాడు కూడా ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంధన సరఫరాను సాధారణ స్థితికి తెచ్చేందుకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు తక్షణమే ఆయిల్ డిస్పాచ్ సెంటర్లకు స్వయంగా వెళ్లి సరఫరాను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. జిల్లాల్లో పరిస్థితులను ఆర్టీజీ సెంటర్ ద్వారా నిరంతరం గమనిస్తూ, ప్రతీ 3 గంటలకు ఒకసారి తనకు నివేదిక అందించాలని మంత్రులను, అధికారులను ఆదేశించారు. ఆయిల్ డిపోల నుంచి రిటైల్ బంకులకు ట్యాంకర్లు ఎలాంటి జాప్యం లేకుండా చేరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు పాల్పడినా, కృత్రిమ కొరత సృష్టించాలని చూసినా వారిపై కఠిన చర్యలు తప్పవని చంద్రబాబు హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పలు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సివిల్ సప్లైస్ ఉన్నతాధికారులు, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కరీంనగర్ శ్రీచైతన్య కాలేజీలో దొంగతనం.. నిందితుడు అరెస్ట్



కరీంనగర్ ఏప్రిల్ 27 (నినాదం):

కరీంనగర్ లోని మంకమ్మతోట ప్రాంతంలో ఉన్న శ్రీచైతన్య కాలేజీలో దొంగతనం జరిగింది. ఈ చోరీని పోలీసులు ఛేదించారు. జల్సాల కోసం దొంగతనాలకు అలవాటు పడి, విద్యా సంస్థలనే లక్ష్యంగా చేసుకుంటున్న పాత నేరస్తుడు బొద్దుల యుగేందర్‌ను కరీంనగర్ టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు.ఏప్రిల్ 26వ తేదీ తెల్లవారుజామున మంకమ్మతోటలోని శ్రీ చైతన్య కాలేజీ ఆఫీసు తాళాలు పగులగొట్టిన నిందితుడు, బీరువాలో ఉన్న రూ. 5 లక్షల నగదు, ఒక బంగారు గొలుసును ఎత్తుకెళ్లాడు. దొంగిలించిన సొత్తును ఎవరికీ అనుమానం రాకుండా తన ఇంటి వెనుక ఉన్న కట్టెల కుప్పలో దాచిపెట్టాడు. పోలీసులు పక్కా సమాచారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని, దొంగిలించిన రూ. 5 లక్షల నగదును, 10 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.

## త్యాగాల పునాదులపై ఏర్పడ్డదే బిఆర్ఎస్

ఎదిగనప్పుడే సమస్యలకు చరమగీతం పాడవచ్చన్నారు. కేసీఆర్25 ఏండ్ల క్రితం జలదృశ్యంలో గులాబీ జెండా ఎత్తిపట్టారని గుర్తు చేశారు. 14 ఏండ్ల తన పోరాటంతో తెలంగాణ జాతిని ఐక్యం చేసి సబ్బండ వర్ణాలను ఏకతాటిపైకి తెచ్చి తెలంగాణ కలను సాకారం చేశారన్నారు. అడుగడుగునా పోరాటాలు చేస్తూ ఢిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అని కేటీఆర్ అన్నారు. పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్.. రాష్టాన్ని అగ్రభాగాన నిలబెట్టారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్, భాజపా పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి.. మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పార్టీ పునరంకితం అవుతుందని అన్నారు. సాధించిన తెలంగాణ కోసం అధికారం అప్పగిస్తే పదేండ్ల కాలంలో బాధ్యతగా పని చేసి అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. కానీ, రెండున్నర ఏండ్ల కాంగ్రెస్ పాలనలో అరాచక పాలన మొదలైందన్నారు. కాంగ్రెస పాలనకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల తరఫున పోరాడుతున్నది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఏ బాధ్యత అప్పగించినా బీఆర్ఎస్ పార్టీ సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలకు స్వీయ రాజకీయ అస్తిత్వం ఉండాలని ప్రొ.జయశంకర్ అనేవారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్, బీజేపీ నుంచి రక్షించుకునేందుకు ఐక్యంగా పోరాడుదామన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చేసేదాకా దండుగా కదం తొక్కుదామని పిలుపునిచ్చారు. కేసీఆర్ దిశానిర్దేశర కోసం గులాబీ దండు ఎదురుచూస్తోందన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వారియర్స్, పార్టీ కార్యకర్తలకు, జర్నలిస్టులకు,కవులు, కళాకారులు, ఉద్యోగులు సమస్త ప్రజానికానికి వినమ్ర ధన్యవాదాలు తెలిపారు.

## విశాఖలో ఘనంగా ప్రారంభమైన ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుక

శత వసంతాల చారిత్రక ప్రస్థానానికి గుర్తుగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమం సోమవారం విశాఖపట్నంలో అత్యంత వైభవంగా ప్రారంభమైంది. దేశానికి ఎందరో మేధావులను, రాజకీయ ప్రముఖులను, ఉన్నతాధికారులను అందించిన ఈ సరస్వతీ నిలయం వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికైంది. విద్యార్థులు, పూర్వ విద్యార్థుల కేరింతలతో ప్రాంగణం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. ఈ చారిత్రక ఘట్టానికి ముఖ్య అతిథిగా భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఒడిశా గవర్నర్ కె. హరిబాబు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, విశాఖ ఎంపీ ఎం. శ్రీభరత్, పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి, ప్రముఖ టాలీవుడ్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కూడా ఈ వేడుకల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల ఘనతకు గుర్తుగా ప్రత్యేక పోస్టల్ స్టాంపును ఆవిష్కరించారు. వర్సిటీ అభివృద్ధి పనులను కూడా ఇదే వేదిక నుంచి ప్రారంభించారు. పరిశోధనలకు ఆయువుపట్టుగా, ఎన్నో ఆవిష్కరణలకు వేదికగా నిలిచిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఘన చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే లక్ష్యంతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల కోసం సుమారు 25 వేల మందికి పైగా ప్రస్తుత, పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. వారి కోసం మూడు భారీ జర్మన్ షెడ్లను ఏర్పాటు చేసి, 36 విభాగాలుగా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రధాన వేదికకు ఇరువైపులా ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, ఆకర్షణీయమైన అలంకరణలతో ప్రాంగణం కొత్త కాంతులతో వెలిగిపోయింది. ఈ శతాబ్ది ఉత్సవాలు విశ్వవిద్యాలయ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోనున్నాయి.

## జనగణనతో సంక్షేమ పథకాలు ఆగవు..

ఉందని చెబితే పథకాలు రాకపోవచ్చని, ఇంట్లో ఏసీ ఉందని చెబితే ప్రయోజనాలు తగ్గిపోతాయని ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ఏ ప్రాంతంలో ఎలాంటి అవసరాలు ఉన్నాయి, ఉపాధి అవకాశాలు ఎక్కడ కల్పించాలనే స్పష్టత కోసమే ఈ వివరాలు సేకరిస్తాం తప్ప, పథకాల కోతకు కాదు" అని భరోసా ఇచ్చారు. భారతదేశపు తొలి పూర్తి డిజిటల్ జనాభా గణన ఇదేనని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన కూడా ఇదే కావడం విశేషమని తెలిపారు. ప్రజలు మే 10వ తేదీ వరకు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. అనంతరం, మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి దశలో భాగంగా ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరిస్తారు.

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్,అజారుద్దీన్ ప్రమాణం

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యానించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టం చేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభించిందని అన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్యలు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముందుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ ముందుకు సాగాలి. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మంత్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదు. సీఎం రేవంత్‌రెడ్డి మొదట్నుంచీ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

## బీఆర్ఎస్ ఓ 'చచ్చిన శవం'..

పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉంది" అంటూ విరుచుకుపడ్డారు. పదేళ్ల అహంకార పూరిత పాలన వల్లే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని, దాని మనుగడే ప్రశ్నార్థకమైందని వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో కల్వకుంట్ల కవిత ప్రకటించిన కొత్త పార్టీపై పరోక్షంగా సెటైర్లు వేస్తూ.. రాష్ట్రంలో కొత్త పార్టీ పెట్టాల్సిన అవసరమే లేదని, అసలు ఉన్న పార్టీయే (బీఆర్ఎస్) ఉంటుందో, ఊడుతుందో తెలియని స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

నేడు చివరి ర్యాలీలో పాల్గొన్నానని.. మళ్లీ బెంగాల్‌లో భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రానికి తిరిగి వస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామన్నారు. అదే ఉత్సాహంతో నేడు తాను వెళ్తున్నట్లు పేర్కొన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు ఇరువైపులా ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని అన్నారు. తనను ఆశీర్వదించడానికి వేలాదిమంది ప్రజలు వస్తారని ఊహించలేదని సంతోషం వ్యక్తంచేశారు. బెంగాల్‌లోని బారక్‌పుర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి ప్రవేశించి.. భాజపాలో చేరిన తర్వాత ఓ కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా చేశానని ప్రధాని వెల్లడించారు. ఎన్నికల బాధ్యతలు స్వీకరించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఓ కుటుంబం అంటూ ఏదీ లేదని.. దేశ ప్రజలే తన కుటుంబమని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని..ఈ రోడ్‌షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యానించారు. వారు అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్నే టీఎంసీ నేతలు విడిచిపెట్టారని ప్రధాని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి దూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ పాలనలో మహిళలపై మునుపెన్నడూ లేని స్థాయిలో దాడులు జరుగుతున్నాయని, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు.

## కోర్టుపై తనకు నమ్మకం పోయింది

కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అంతరాత్మ ప్రభోదం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేజ్రీవాల్ వెల్లడించారు. 'న్యాయం జరుగుతుందన్న ఆశలు ఆవిరయ్యాయి. అందుకే మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గంలో నడవాలని నిర్ణయించుకున్నాను. వ్యక్తిగతంగా గానీ, కనీసం నా తరఫు న్యాయవాది ద్వారా గానీ విచారణకు హాజరుకాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయితే, చట్టపరంగా తనకు ఉన్న హక్కుల ప్రకారం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, సోమవారం విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు కావడంతో హైకోర్టు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు బెంగాల్ ఎన్నికల వేడి, మరోవైపు కేజ్రీవాల్ చుట్టూ తిరుగుతున్న ఈ న్యాయ వివాదాలు దేశ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి.మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో పాటు ఇతర నిందితులను ట్రయల్ కోర్టు గతంలో విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్నారు. అయితే, ఈమె గతంలో కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. ఈ కేసు నుంచి ఆమె తప్పుకోవాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. గత ఏప్రిల్ 20 ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టివేశారు. 'న్యాయమూర్తుల నిజాయతీని లిటిగెంట్లు విచారించలేరు. కేవలం ఊహల ఆధారంగా రీక్యూసల్ కోరలేరు' అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, స్వయంగా న్యాయమూర్తికి వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాయవ్యవస్థపై కేజ్రీవాల్‌కు గౌరవం లేదని బీజేపీ విమర్శిస్తుంటే, తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్
సోమవారం ఏప్రిల్ 27 2026
ninadam.in



# ఏపీ-ఒడిశా సరిహద్దులో మళ్లీ ఉద్రిక్తత.. ఒడిశా అధికారులపై మంత్రి సంధ్యారాణి ఫైర్

- ఏపీ-ఒడిశా సరిహద్దులోని కొఠియాలో జనగణన విషయంలో వివాదం
- ఒడిశా అధికారులకు సహకరించని ఇద్దరు స్థానిక గిరిజనుల అరెస్ట్
- అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- సీఎం చంద్రబాబు దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తానని మంత్రి వెల్లడి




**అమరావతి, ఏప్రిల్ 27 ( నినాదం ):** ఆంధ్రప్రదేశ్-ఒడిశా రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా నలుగుతున్న కొఠియా గ్రామాల వివాదం మరోసారి భగ్గుమంది. జనగణన సేకరణ కోసం వచ్చిన ఒడిశా అధికారుల చర్యలతో సరిహద్దులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనలో ఇద్దరు స్థానిక గిరిజనులను ఒడిశా పోలీసులు అరెస్ట్ చేయడంతో వివాదం మరింత ముదిరింది. వివరాల్లోకి వెళితే... పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం గంజాయిభద్ర పంచాయతీ పరిధిలోని ఎగువశెంబి గ్రామంలో ఒడిశా అధికారులు శనివారం జనగణన చేపట్టేందుకు ప్రయత్నించారు. అయితే, అక్కడి గిరిజనులు తాము ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారమని, ఒడిశా అధికారులకు ఎలాంటి వివరాలు ఇవ్వబోమని స్పష్టం చేశారు. తమ వివరాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమే నమోదు చేసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఒడిశా అధికారుల చర్యలను వ్యతిరేకించిన తాడంగి చిరంజీవి, తాడంగి పిలుకులు అనే ఇద్దరు స్థానికులపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఒడిశా పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని తమ రాష్ట్రానికి తరలించారు. ఈ విషయం తెలియగానే ఏపీ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తీవ్రస్థాయిలో స్పందించారు. ఒడిశా అధికారుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిహద్దులోని 21 గ్రామాల్లో ఒడిశా పోలీసులు తరచూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ప్రతి పౌరుడికి నచ్చిన చోట జీవించే హక్కు ఉందని, అమాయక గిరిజనులను బెదిరించి, అరెస్టులు చేయడం సరికాదని అన్నారు. న్యాయస్థానం ఆదేశాలను సైతం లెక్కచేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. ఏపీ భూభాగంలోకి వచ్చి ఒడిశా అధికారులు పెత్తనం చేయడం, దౌర్జన్యానికి పాల్పడటం ఏంటని ప్రశ్నించారు. అరెస్ట్ చేసిన ఇద్దరినీ తక్షణమే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం వారికి అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తాజా ఘటనతో కొఠియా వివాదం మరోసారి తెరపైకి రాగా, ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## తాడిపత్రిలో దారుణం..
# బైక్ తాళం కోసం స్నేహితుడి హత్య!

- నిందితులు గౌస్, కార్తీక్‌లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**అనంతపురం, ఏప్రిల్ 27 (నినాదం):** అనంతపురం జిల్లా తాడిపత్రిలో స్నేహితుల మధ్య చెలరేగిన ఓ చిన్న వివాదం హత్యకు దారి తీసింది. బైక్ తాళం విషయంలో మొదలైన గొడవ, చివరకు ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. స్నేహితులే కాలయముళ్లై రాళ్లతో కొట్టి చంపిన ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తాడిపత్రి పట్టణంలోని బంకమట్టి కాలనీకి చెందిన దూదేకుల అబ్దుల్లా, గౌస్, కార్తీక్‌లు స్నేహితులు. ఆదివారం రాత్రి అబ్దుల్లాకు చెందిన బైక్ తాళాన్ని స్నేహితులు కింద పడేశారు. ఈ విషయమై వారి మధ్య మాటామాటా పెరిగి తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ఆవేశానికి లోనైన గౌస్, కార్తీక్‌లు.. పక్కనే ఉన్న పదునైన నాపరాళ్లతో అబ్దుల్లా తల, ఇతర భాగాలపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన అబ్దుల్లా, అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాడిపత్రి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన గౌస్, కార్తీక్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనతో బంకమట్టి కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి

## శేషాచలం అడవుల్లో
# భారీ అగ్నిప్రమాదం..

- అదుపులోకి తెచ్చిన అధికారులు



**తిరుపతి ఏప్రిల్ 27 (నినాదం):** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి సమీపంలోని శేషాచలం అటవీ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. జీవకోన అటవీ రేంజ్‌లోని మొండోడికోన ప్రాంతంలో మంటలు చెలరేగాయి. అవి ఉద్ధృతంగా మారి, నగరం నుంచి కూడా దట్టమైన పొగ, అగ్నికీలలు కనిపించడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే అటవీ శాఖ, టీటీడీ, అగ్నిమాపక శాఖలకు చెందిన సుమారు 50 మంది సిబ్బంది రంగంలోకి దిగారు. ఫైర్ లైన్లు ఏర్పాటు చేసి, ఫైర్ బీటర్లతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. ఈ ప్రమాదంలో సుమారు 2 కిలోమీటర్ల మేర అటవీ ప్రాంతం కాలిపోయిందని, విలువైన వృక్షసంపద, వనమూలికలు అగ్నికి ఆహుతయ్యాయని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మంటల ధాటికి వన్యప్రాణులు భయంతో పరుగులు తీశాయి. ప్రమాదానికి కచ్చితమైన కారణాలపై జిల్లా అటవీ అధికారి వి.సాయిబాబా ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండిపోయిన గడ్డి అంటుకుందా?, లేక ఎవరైనా ఆకతాయిలు నిప్పు పెట్టారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. పరిస్థితి అదుపులోకి వచ్చిందని డీఎఫ్‌వో తెలిపారు. ఎర్రచందనం గిడ్డంగులు సమీపంలో ఉండటంతో ఆ ప్రాంతానికి మంటలు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్పష్టం చేశారు.

# తాడిపత్రిలో హిజ్రా దారుణ హత్య.. ముగ్గురి అరెస్ట్!

- తాడిపత్రి రైల్వే గేట్ వద్ద పట్టాలపై హిజ్రా మృతదేహం
- మల్లిక అనే హిజ్రాను హత్య చేశారని తోటివారి ఆరోపణ



**అనంతపురం ఏప్రిల్ 27 (నినాదం):** అనంతపురం జిల్లా తాడిపత్రిలో మల్లిక అనే హిజ్రా అనుమానాస్పద మృతి ఘటన తీవ్ర కలకలం రేపింది. మల్లిక రైలు పట్టాలపై శవంగా కనిపించడంతో ఇది ముమ్మాటికీ హత్యేనని, ప్రత్యర్థి వర్గం వారే ఈ దారుణానికి పాల్పడ్డారని తోటి హిజ్రాలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, తాడిపత్రికి చెందిన మల్లిక నిన్న సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు ఆమెను ఆటోలో బలవంతంగా ఎక్కించుకుని తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ కిడ్నాప్ దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వీడియో ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిన్న రాత్రి చల్లవారిపల్లి రైల్వే గేట్ సమీపంలో పట్టాలపై మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో, పోలీసులు అక్కడికి చేరుకుని దాన్ని మల్లిక మృతదేహంగా గుర్తించారు. మల్లిక మరణ వార్త తెలియగానే తోటి హిజ్రాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ప్రత్యర్థి గ్రూపు వారే పథకం ప్రకారం మల్లికను కిడ్నాప్ చేసి హత్య చేశారని వారు ఆరోపించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు.. శిరీష, సంగీత, రాధ అనే ముగ్గురు హిజ్రాలను అనుమానితులుగా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హిజ్రా వర్గాల మధ్య ఉన్న గ్రూపు తగాదాలే ఈ హత్యకు కారణమా? లేక మరో కోణం ఉందా? అనే దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

# సామాన్యుడి పెళ్లికి ప్రధాని మోదీ ఆశీస్సులు.. ఆనందంలో నవ వరుడు!

- రాయచూరు జిల్లా వాసి రాజేశ్ నాయక్ పంపిన ఆహ్వానానికి ప్రధాని స్పందన
- నవ దంపతులు ఆదర్శంగా నిలవాలంటూ లేఖలో మోదీ ఆకాంక్ష
- ప్రధాని స్పందనపై రాజేశ్ నాయక్, ఆయన కుటుంబ సభ్యుల హర్షం

**ఢిల్లీ, ఏప్రిల్ 27 (నినాదం):** దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఓ సామాన్యుడి పట్ల చూపిన ఆదరణ ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. కర్ణాటకకు చెందిన ఓ యువకుడు తన వివాహానికి ఆహ్వానిస్తూ పంపిన పెళ్లి పత్రికకు ప్రధాని స్పందించారు. కేవలం స్పందించడమే కాకుండా, నవ దంపతులను మనసారా ఆశీర్వదిస్తూ అధికారికంగా ఒక లేఖ పంపారు. ఈ విషయాన్ని ఆ యువకుడు వీడియో ద్వారా పంచుకోవడంతో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రధాని మోదీ తీరుపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే... కర్ణాటకలోని రాయచూరు జిల్లా కనిహాల గ్రామానికి చెందిన రాజేశ్ నాయక్ అనే యువకుడికి ఈ నెల 13న సవిత అనే యువతితో వివాహం జరిగింది. ప్రధాని మోదీపై ఉన్న అభిమానంతో తన పెళ్లికి ఆయనను కూడా ఆహ్వానించాలని రాజేశ్ భావించాడు. ఈ మేరకు తన పెళ్లి పత్రికను పోస్టు ద్వారా ప్రధాని కార్యాలయానికి పంపాడు. అయితే, దేశ ప్రధాని నుంచి స్పందన వస్తుందని ఆయన ఊహించలేదు. కానీ, రాజేశ్ ఆశ్చర్యానికి గురయ్యేలా ఈ నెల 16వ తేదీతో ప్రధాని మోదీ కార్యాలయం నుంచి అధికారికంగా ఒక లేఖ అందింది. ఆ లేఖలో ప్రధాని మోదీ నూతన వధూవరులను పేరుపేరునా అభినందించారు. "శ్రీ రాజేశ్ నాయక్ జీ, మీ వివాహానికి నన్ను ఆహ్వానించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ శుభ సమయంలో మీరిద్దరూ అడుగుపెడుతున్న వేళ,




మీకు అద్భుతమైన భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. మీ దంపతుల మనసులు, ఆలోచనలు, చేతలు ఎల్లప్పుడూ సామరస్యంగా ఉండాలి. ఒకరికొకరు అండగా నిలవండి. మీ కలలు, ఆశయాల సాధనలో ఒకరి చేతిని ఒకరు పట్టుకుని సాగండి" అని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. ప్రధాని నుంచి లేఖ అందడంపై రాజేశ్ నాయక్ ఆనందం వ్యక్తం చేశారు. "నా పెళ్లి పత్రికను ప్రధాని చదువుతారని కలలో కూడా ఊహించలేదు. దేశంలో అత్యున్నత పదవిలో ఉన్నప్పటికీ, ఒక సామాన్యుడి లేఖను పరిగణనలోకి తీసుకుని, ఇంత ఆత్మీయంగా స్పందించడం ఆయన గొప్ప మనసుకు నిదర్శనం. ఇది నాకు, నా భార్యకు, మా కుటుంబానికి, మా కనిహాల గ్రామ ప్రజలందరికీ గర్వకారణం. ఆయనకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను" అని రాజేశ్ ఉద్వేగంగా తెలిపారు.

# సహజీవనం చేసి, విడిపోయేటప్పుడు లైంగిక దాడి అంటే ఎలా?


- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- పరస్పర అంగీకారంతో కూడిన సహజీవనానికి, లైంగిక నేరాలకు తేడా ఉందన్న కోర్టు



**ఢిల్లీ, ఏప్రిల్ 27 (నినాదం):** పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై అత్యాచారం, లైంగిక దాడికి పాల్పడ్డాడని ఒక వ్యక్తిపై ఆరోపణలు చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌పై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పరస్పర అంగీకారంతో కూడిన సహజీవనానికి, నేరపూరిత లైంగిక నేరాలకు మధ్య తేడాను కోర్టు నొక్కి చెప్పింది. ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తన సహజీవన భాగస్వామిపై సదరు మహిళ లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ పిటిషన్ వేసింది. పరస్పర అంగీకారంతో ఏర్పడిన ఆ బంధం వీగిపోయిన తర్వాత అది లైంగిక దాడి ఎలా అవుతుందని జస్టిస్ బీవీ నాగరత్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు సహజీవనానికి సంబంధించినదని, వివాహం కాకుండానే మహిళ బిడ్డకు కూడా జన్మనిచ్చిందని తెలిపారు. కానీ ఇప్పుడు ఆమె దాడి, అత్యాచారం అంటోందని అన్నారు. సమ్మతితో ఏర్పడిన బంధం చివరకు దాడిగా ఎలా మారిందని ప్రశ్నించారు. వివాహ ప్రస్తావన లేకుండా ఏర్పడిన బంధాల్లో ఉన్న సమస్యలు ఇవేనని, కొన్నేళ్ల పాటు కలిసి ఉన్న ఆ మహిళ ఇప్పుడు ఫిర్యాదు చేయడమేమిటని ప్రశ్నించారు. పిటిషనర్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ, నిందితుడు ఆ మహిళను కలిసినప్పుడు ఆమె వయస్సు పద్దెనిమిది అని, అప్పుడు ఆమె ఒక వితంతువు అని కోర్టుకు తెలిపారు. అతడికి కూడా అప్పటికే పెళ్లి అయిపోయిందని, కానీ ఆ విషయాన్ని దాచిపెట్టి అతడు సంబంధాన్ని కొనసాగించాడని పేర్కొన్నారు. ఇతర మహిళలను కూడా అతడు ఇలాగే మోసం చేశాడని అన్నారు. అయితే, ఆమె పెళ్లి చేసుకోవడానికి బదులు కలిసి జీవించడానికి ఎందుకు అంగీకరించిందని ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రశ్నించారు. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం లైంగిక దాడి కాదని స్పష్టం చేశారు. అలాగే మహిళ పరిస్థితిపై న్యాయమూర్తి సానుభూతి వ్యక్తం చేశారు. ఆ బిడ్డ పోషణ కోసం భరణం కోరవచ్చని సూచించారు. ఈ సమస్యను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు.

## ఢిల్లీలో పోలీసు ఘాతుకం
# ఫుడ్ డెలివరీ ఏజెంట్‌ను కాల్చి చంపిన కానిస్టేబుల్

- మృతుడి స్నేహితుడికి తీవ్ర గాయాలు, ఆసుపత్రిలో చికిత్స
- వాగ్వివాదం జరగడంతో కానిస్టేబుల్ కాల్పులు జరిపినట్టు ఆరోపణ
- కులం అడిగి, బిహార్ వారని తెలియగానే కాల్చాడంటున్న కుటుంబ సభ్యులు
- నిందితుడైన కానిస్టేబుల్ పరారీ, గాలింపు చేపట్టిన పోలీసులు



**ఢిల్లీ ఏప్రిల్ 27 (నినాదం) :** దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఓ ఫుడ్ డెలివరీ ఏజెంట్‌పై ఢిల్లీ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కాల్పులు జరపడంతో అతడు మృతి చెందాడు. మృతుడి స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆదివారం తెల్లవారు జామున 2:30 గంటల సమయంలో ఢిల్లీ శివారు జాఫర్‌పూర్ కలాన్ గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాండవ్ కుమార్ (21), అతడి స్నేహితుడు కృష్ణ ఓ పుట్టినరోజు వేడుకకు హాజరై తిరిగి వస్తున్నారు. రోడ్డుపై నిలబడి స్నేహితులతో మాట్లాడుతుండగా ఎదురింట్లో నివసించే హెడ్ కానిస్టేబుల్ నీరజ్ అక్కడికి వచ్చి వారితో వాగ్వివాదానికి దిగాడు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన నీరజ్, బైక్‌పై ఉన్న పాండవ్ ఛాతీపై అతి సమీపం నుంచి కాల్పులు జరిపాడు. బుల్లెట్ పాండవ్ శరీరం నుంచి దూసుకెళ్లి, వెనుక కూర్చున్న కృష్ణ పొట్టలోకి దిగింది. ఇద్దరినీ వెంటనే ఆసుపత్రికి తరలించగా, పాండవ్ అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కృష్ణకు ప్రస్తుతం చికిత్స కొనసాగుతోంది. ఘటన సమయంలో నిందితుడు నీరజ్ మద్యం మత్తులో ఉన్నాడని, కులం పేరుతో దూషించాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. "మేము బిహార్‌కు చెందిన వాళ్లమని తెలియగానే, అతడు కాల్పులు జరిపి పారిపోయాడు" అని పాండవ్ తల్లి మీనా దేవి కన్నీటిపర్యంతమయ్యారు. తన కుమారుడి మృతికి కారణమైన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. కుటుంబానికి పాండవ్ ఒక్కడే ఆధారం అని బంధువులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. స్పెషల్ సెల్‌లో పనిచేస్తున్న నిందితుడు నీరజ్ పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# కవిత కొత్త పార్టీ ఏర్పాటు వెనుక సీఎం రేవంత్ హస్తం ఉందంటున్న మల్లన్న

- బీఆర్ఎస్‌ను పూర్తిగా దెబ్బతీసేందుకే ఈ ఎత్తుగడ అని ఆరోపణ
- రేవంత్ కేబినెట్‌లో మంత్రి పదవి కోసం కవిత ప్రయత్నించారని వ్యాఖ్య
- ఈ విషయం తెలిసే కేసీఆర్ ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని వెల్లడి
- కవిత చదివేది రేవంత్ స్క్రిప్ట్ అని, ఫండింగ్ కూడా ఆయనదేనని మల్లన్న వ్యాఖ్య



**హైదరాబాద్ ఏప్రిల్ 27 (నినాదం) :** కల్వకుంట్ల కవిత కొత్తగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ రాష్ట్ర సేన' (టీఆర్ఎస్) పార్టీపై ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సంచలన ఆరోపణలు చేశారు. ఈ పార్టీ ఏర్పాటు వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందని, బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా ఖతం చేయడమే లక్ష్యంగా ఈ రాజకీయ వ్యూహం పన్నారని వ్యాఖ్యానించారు. కవిత మాట్లాడే ప్రతి మాట వెనుక రేవంత్ రెడ్డి రాసిన స్క్రిప్ట్ ఉందని, ఆమె పార్టీ కార్యక్రమాలకు అవసరమైన నిధులను కూడా ఆయనే సమకూరుస్తున్నారని మల్లన్న ఆరోపించారు. ఈ సందర్భంగా కవితకు మల్లన్న నేరుగా సవాల్ విసిరారు. "మొన్న జరిగిన మంత్రివర్గ విస్తరణలో వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, వివేక్‌లతో పాటు నాలుగో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాల్సింది మీరే కదా? ఈ విషయం నిజమో? కాదో? మీ పిల్లలపై ఒట్టేసి చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరి మంత్రి పదవి పొందేందుకు కవిత ప్రయత్నించారని, ఈ విషయం కేసీఆర్, కేటీఆర్‌లకు తెలియడంతోనే ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేశారని మల్లన్న వివరించారు. ఇప్పుడు దానిని 'ఆత్మగౌరవ పోరాటం'గా చిత్రీకరించడం హాస్యాస్పదమని విమర్శించారు. "బీఆర్ఎస్ పార్టీని మోసం చేసి మీరు కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. మంత్రిగా మారటానికి వేసిన కుట్ర విఫలమైంది. ఇప్పుడు తెలంగాణ వాదం పేరుతో డ్రామాలు ఎందుకు? ఏఐసీసీలోని ఓ కీలక నేతతో మీరు టచ్‌లో ఉన్న మాట వాస్తవం కాదా?" అని మల్లన్న ప్రశ్నించారు. కేసీఆర్‌ను 'మర మనిషి' అంటూ కవిత చేసిన విమర్శలను ప్రస్తావిస్తూ, ఆయన వదిలేసిన తెలంగాణ ఆత్మను కాపాడతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రస్తుతం తీన్మార్ మల్లన్న చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకు కాంగ్రెస్, కవిత కలిసి ఈ నాటకం ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలు, సవాళ్లపై కవిత, ఆమె కొత్త పార్టీ నేతలు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.


# విశాఖలో ఇన్ఫోసిస్‌కు 20 ఎకరాల కేటాయింపు

- రూ. 750 కోట్లతో క్యాంపస్‌ను విస్తరించనున్న ఇన్ఫోసిస్
- 7 వేల మందికి ఉద్యోగ అవకాశాలు




**విశాఖపట్నం ఏప్రిల్ 27 (నినాదం):** ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ పటంలో అగ్రస్థానంలో నిలిపే దిశగా కూటమి ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రముఖ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు విశాఖపట్నంలో 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు రూ. 750 కోట్ల భారీ పెట్టుబడితో ఇన్ఫోసిస్ తన కేంపస్‌ను ఇక్కడ విస్తరించనుంది. ఈ కొత్త కేంపస్ ద్వారా ప్రారంభ దశలోనే సుమారు 7 వేల మంది సాఫ్ట్‌వేర్ నిపుణులకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఐటీ, ఐటీఈఎస్ (ITeS) కేంపస్ ద్వారా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్ రంగాల్లో విశాఖ గ్లోబల్ సెంటర్‌గా మారనుంది. ఇన్ఫోసిస్ వంటి గ్లోబల్ బ్రాండ్ రాకతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడటమే కాకుండా, మరిన్ని అనుబంధ సంస్థలు విశాఖ వైపు చూసే అవకాశం ఉంది.

## భువనేశ్వర్‌లో దారుణం..
# ఎంబీఏ విద్యార్థినిపై కిరాణా వ్యాపారి అత్యాచారం



**బిలాస్‌పూర్ ఏప్రిల్ 27 (నినాదం) :** భువనేశ్వర్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఎంబీఏ చదువుతున్న ఓ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన కిరాణా దుకాణదారుడిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌కు చెందిన 20 ఏళ్ల యువతి స్థానికంగా ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతూ ఓ అద్దె ఇంట్లో ఉంటోంది. శుక్రవారం రాత్రి ఆమె రూమ్‌మేట్ ఊర్లో లేని సమయంలో ఈ ఘటన జరిగింది. బాధితురాలు దగ్గరలోని కిరాణా షాపు నుంచి కొన్ని సరుకులు ఆర్డర్ చేసింది. సరుకులు డెలివరీ చేసేందుకు వచ్చిన నిందితుడు ఇంట్లో ఆమె ఒంటరిగా ఉండటాన్ని గమనించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలు శనివారం ఇన్ఫో వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 64(1), 62 కింద కేసు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, ఇతర పక్కా ఆధారాలు సేకరించిన తర్వాత నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేశారు. బాధితురాలి వాంగ్మూలాన్ని మేజిస్ట్రేట్ ముందు నమోదు చేసి, వైద్య పరీక్షలు కూడా పూర్తి చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్‌కు చెక్.. రూ.7,042 కోట్లతో 'హెచ్-సిటీ'

- హైదరాబాద్ అభివృద్ధికి 'హెచ్-సిటీ' పేరిట ప్రభుత్వ కొత్త ప్రణాళిక
- మౌలిక వసతుల కోసం రూ.7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు
- కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.1,090 కోట్లు
- ముగింపు దశకు నల్గొండ ఎక్స్ రోడ్స్-ఐఎస్ సదన్ ఫ్లైఓవర్ పనులు
- పెండింగ్ పనుల పూర్తితో నగరంలో ట్రాఫిక్ రహిత ప్రయాణం లక్ష్యం



**హైదరాబాద్ ఏప్రిల్ 27 (నినాదం) :** హైదరాబాద్ మహానగరాన్ని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'హెచ్-సిటీ' (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) అనే బృహత్తర ప్రాజెక్టును పట్టాలెక్కించింది. గత ప్రభుత్వ హయాంలో మొదలై అసంపూర్తిగా ఉన్న వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ) పనులతో పాటు కొత్తగా గుర్తించిన ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి నగర రూపురేఖలు మార్చాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం రూ. 7,042 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో సింహభాగమైన రూ. 5,942 కోట్లను 'హెచ్-సిటీ' పనులకే కేటాయించడం గమనార్హం. ఈ ప్రాజెక్టు అమలును వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ కార్పొరేషన్ల కమిషనర్లు ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ ప్రాంతంలోని కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ. 1,090 కోట్లతో భారీ నిర్మాణాలు చేపట్టనున్నారు. దీనిని రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో రూ. 580 కోట్లతో కేబీఆర్ పార్కు ఎంట్రెన్స్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ జంక్షన్లలో రెండు స్టీల్ బ్రిడ్జిలు, మూడు అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. రెండో ప్యాకేజీ కింద రూ. 510 కోట్లతో ఫిల్మ్‌నగర్, రోడ్డు నంబర్ 45 జంక్షన్ల వద్ద మరో నాలుగు స్టీల్ బ్రిడ్జిలు, నాలుగు అండర్‌పాసులు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. మరోవైపు దక్షిణ హైదరాబాద్ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నల్గొండ ఎక్స్ రోడ్స్-సైదాబాద్-ఐఎస్ సదన్ -ఓవైసీ జంక్షన్ కారిడార్ ఫ్లైఓవర్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. సుమారు 2.5 కిలోమీటర్ల పొడవుతో రూ. 620 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఫ్లైఓవర్ పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయి. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే పాతబస్తీ, కొత్త నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టులను పూర్తి చేసి, హైదరాబాద్‌ను ట్రాఫిక్ రహిత నగరంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

సోమవారం ఏప్రిల్ 27 2026

ninadam.in




# కేంద్రానిది పచ్చి 'ఇంధన' మోసం..

## సామాన్యుడిపై భాజపా సర్కార్ నైచ్యం!



- మాయ మాటలు మాని.. బంకుల వద్ద క్యూలైన్లను చూడండి
- సర్పంచ్ లావుడ్యా పూర్ణ ఆగ్రహం
- భద్రాద్రి జిల్లాలో చుక్క డీజిల్, పెట్రోల్ కోసం బారులు.. వాహనదారుల కన్నీళ్లు
- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అబద్ధపు ప్రచారాలు!

**కొత్తగూడెం, ఏప్రిల్27(నినాదం)**

"కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు సామాన్య జనమే బలి కావాలా? ఢిల్లీ పెద్దల మాయ మాటలతో కడుపు నిండుతుందా?" అంటూ రేగళ్లపాడు పెద్దతండా సర్పంచ్ లావుడ్యా పూర్ణ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. జిల్లాలో నెలకొన్న తీవ్రమైన పెట్రోల్, డీజిల్ కొరతను నిరసిస్తూ కేంద్ర వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి ఇంధన సరఫరాను కూడా సక్రమంగా చేయలేని స్థితిలో కేంద్రం ఉందని మండిపడ్డారు. కొరత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు నిల్వలు లేవా? లేక కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అని నిలదీశారు. పెట్రోల్ లేక సామాన్యుడి ప్రయాణం, డీజిల్ లేక రైతన్న నాగలి ఆగిపోయిందని.. దీనికి కేంద్రమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బంకుల చుట్టూ తిరగలేక, పనిపాటలు వదులుకుని క్యూలైన్లలో వేచి చూడలేక జనం నరకం చూస్తున్నారని పూర్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అబద్ధపు ప్రచారాలు ఆపి, తక్షణమే పెట్రోల్ నిల్వలను పునరుద్ధరించాలని హెచ్చరించారు. ప్రభుత్వం చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని, జిల్లాలోని బంకుల వద్ద కనిపిస్తున్న కిలోమీటర్ల మేర క్యూలైన్లే కేంద్ర వైఫల్యానికి సజీవ సాక్ష్యాలని ధ్వజమెత్తారు. ప్రజలను మోసం చేస్తూ కాలం గడపడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని లేనిపక్షంలో బాధితులతో కలిసి రోడ్ల మీదకు వచ్చి కేంద్రానికి బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

# తెలంగాణలో భగ్గుమంటున్న భానుడు..

## వడదెబ్బకు ముగ్గురు మృతి

- ఆదిలాబాద్‌లో రికార్డు స్థాయిలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రత
- అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ హెచ్చరిక

**హైదరాబాద్ ఏప్రిల్ 27 (నినాదం) :**

తెలంగాణలో భానుడు భగ్గుమంటున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. అడవుల జిల్లాగా పేరుగాంచిన ఆదిలాబాద్ ఇప్పుడు నిప్పుల కొలిమిని తలపిస్తోంది. ఆదివారం ఇక్కడ రికార్డు స్థాయిలో ఏకంగా 45.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 3.5 డిగ్రీలు అధికం కావడం గమనార్హం. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల మార్కును దాటాయి. పలు ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తుండటంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఈ ఎండల తీవ్రతకు రాష్ట్రంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో మాదినేని ఆరోగ్య బాబు (57) అనే రైతు పొలం పనులకు వెళ్లి వడదెబ్బకు గురై అక్కడికక్కడే మరణించారు. ఇదే తరహాలో నల్గొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన ఎన్. యాదయ్య (56), సూర్యాపేట జిల్లా రాఘవపురానికి చెందిన రావుల వేలాద్రి (60) కూడా వ్యవసాయ పనులు చేస్తుండగా వడదెబ్బ తగిలి ప్రాణాలు విడిచారు. మధ్యాహ్న సమయాల్లో రైతులు, కూలీలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం రాబోయే రెండు రోజులు (ఇవాళ, రేపు) ఉష్ణోగ్రతలు ఇంకా 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఎండల తీవ్రత మరింత అధికం కానుంది. అయితే, ఈ భగభగల నుంచి ఉపశమనం కలిగించేలా వర్ష సూచన కూడా ఉంది. సోమవారం ఉత్తర తెలంగాణ జిల్లాల్లో, మంగళవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురవవచ్చని ఐఎండీ తెలిపింది. ఈ నెల 29 నుంచి మే 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. దాహం వేయకపోయినా తరచూ నీళ్లు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటివి తీసుకోవాలని సూచిస్తున్నారు. వేపుళ్లు, మసాలా పదార్థాలకు దూరంగా ఉండి, తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిదని చెబుతున్నారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నపిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# ఉత్తరాఖండ్ లోని అలకనంద నదిలో హైదరాబాద్ విద్యార్థి గల్లంతు

- ఎన్ఐటీలో బీటెక్ చదువుతున్న ఆనంద్ మోహన్‌గా గుర్తింపు



**హైదరాబాద్ ఏప్రిల్ 27 (నినాదం) :**

ఉత్తరాఖండ్‌లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న హైదరాబాద్ విద్యార్థి గల్లంతైన ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. స్నేహితులతో కలిసి నది ఒడ్డుకు వెళ్లిన యువకుడు, ప్రమాదవశాత్తు అలకనంద నది ప్రవాహంలో కొట్టుకుపోయాడు. ఈ ఘటన పౌరీ గర్వాల్ జిల్లాలోని శ్రీనగర్‌లో నిన్న సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, హైదరాబాద్‌కు చెందిన ఆనంద్ మోహన్ (21), శ్రీనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. నిన్న సాయంత్రం 4 గంటల సమయంలో ముగ్గురు స్నేహితులతో కలిసి క్యాంపస్ సమీపంలోని అలకనంద నది ఒడ్డుకు వెళ్ళాడు. అక్కడి దిబ్బ పైనుంచి సరదాగా నదిలోకి దూకిన ఆనంద్, బలమైన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. అతను తిరిగి పైకి రాకపోవడంతో ఆందోళనకు గురైన స్నేహితులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న శ్రీనగర్ పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్) బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే, చీకటి పడటం, నదిలో ప్రవాహం అత్యంత ఉధృతంగా ఉండటంతో ఆదివారం రాత్రికి గాలింపును తాత్కాలికంగా నిలిపివేశారు. అలకనంద నదిలో ప్రవాహం చాలా బలంగా ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సోమవారం ఉదయం నుంచి గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపును ముమ్మరం చేస్తామని శ్రీనగర్ కొత్వాలి ఇన్‌ఛార్జ్ ఇన్స్‌పెక్టర్ కులదీప్ సింగ్ తెలిపారు. విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు తెలిసింది.

# గుర్తుకొస్తున్నాయి..

## 23 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి స్నేహితులు



**మంచిర్యాల, ఏప్రిల్ 27(నినాదం):**

వారంతా చిన్ననాటి స్నేహితులు.. కలిసి ఒకే పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నారు. ఉన్నత చదువుల కోసం విడిపోయారు. వివిధ ఉద్యోగాలు, వృత్తులు, హోదాల్లో స్థిరపడ్డారు. 23 ఏళ్ల తర్వాత అంతా ఒకే వేదికపైకి చేరుకున్నారు. అపూర్వ వేడుకను ఆత్మీయంగా జరుపుకున్నారు. నస్పూర్ లోని బొమ్మరిల్లు ఫంక్షన్ హాల్ లో శ్రీ సాందిపాని పాఠశాలలో 2002-03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 ఏళ్ల తర్వాత ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వివిధ కారణాలతో మృతిచెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మశాంతికి మౌనం పాటించారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పి తమ ఉన్నతికి కారణమైన కరెస్పాండెంట్ రాజేంద్రపాణితోపాటు గురువులను సన్మానించారు.

ఆత్మీయ పలకరింపులు

అలింగణాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన దాట్ల రమేష్ గారు , సంధినేని సతీష్ యాదవ్ , తోడే సతీశ్వర్ రెడ్డి , శ్యామ్, జిల్లా శ్రావణ్ కుమార్, సుష్మా రెడ్డి, గాదె రమేష్, అన్న సతీష్, పద్మ, సుదిష్ణ, మహేష్ లను తోటి స్నేహితులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు మల్లేత్తుల శ్రీనివాస్ యాదవ్ , రేగండ్ల ఉపేందర్ , సంజీవ్ ,సంపత్, భానేష్, మల్లిక్, భూమయ్య, రవీందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలి



**మంచిర్యాల, ఏప్రిల్ 27(నినాదం):**

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికేల శ్రవణ్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షుడు దగ్గుల మధుకర్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం 8 వేల కోట్ల ఫీజు రియింబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని బి.ఆర్.ఎస్వి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏ వో కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల పై తరగతులకు వెళ్లడానికి అదేవిధంగా ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలను కోల్పోవడం జరుగుతుందన్నారు. చదువుతున్న విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్ మెంటు విడుదల చేయాలని ఎన్ని నిరసనలు చేసినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి గారు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు మానసిక శోభకు గురై సరైన విద్యను పొందలేకపోతున్నారని తెలిపారు. రీయంబర్స్ మెంట్ విడుదల కాక పోవటం వల్ల విద్యార్థులు పై చదువులకోసం లేదా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకోసం దరఖాస్తు చేసుకునే వారికి ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వటం లేదన్నారు. కొన్ని యాజమాన్యాలు ప్రభుత్వం రీయంబర్స్ మెంట్ ఇవ్వడం లేదని రాష్ట్ర హైకోర్ట్ ను ఆశ్రయించారు,ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించినా కౌంటర్ వేయకపోవటం వల్ల వచ్చే విద్యాసంవత్సరం 2026 27 నుంచి విద్యార్థుల దగ్గరనుండి వసూలు చేసుకోవచ్చని చెప్పడం వల్ల ఫీజు భారం విద్యార్థి మీద పడి ఉన్నత విద్యకి దూరం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే ఫీజ్ రియంబర్సు మెంట్ స్కాలర్ షిప్ నిధులు విడుదల చేయాలని బిఆర్ఎస్వి డిమాండ్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వి బెల్లంపల్లి పట్టణ అధ్యక్షులు ఆడెపు అరుణ్ ప్రసాద్, మంచిర్యాల జిల్లా నాయకులు మహమ్మద్ సాజిద్ చోటు,తిరుపతి, నడిపెల్లి నవదీప్, బెల్లం అరుణ్, ముస్తాఫ్ఫా,మెహరన్, దేవి సాయి కృష్ణ , నస్పూర్ శివ తదితరులు బిఆర్ఎస్వీ విద్యార్థి విభాగ నాయకులు ఈ కార్యక్రమం లో పాల్గొనడం జరిగింది

# పేట కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన సి.హెచ్ ప్రియాంక.



**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 27, (నినాదం):**

నారాయణపేట జిల్లా నూతన కలెక్టర్ గా సీ.హెచ్. ప్రియాంక సోమవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ లో బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక ను జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, ఏవో శ్రీధర్, జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలు, బొక్కెలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



# బంకుల వద్ద బారులు.. వాహనదారులకు చుక్కలు..!

**మహబూబాబాద్ ఏప్రిల్ 27 (నినాదం ):**

జిల్లా వ్యాప్తంగా డీజిల్, పెట్రోల్ కొరత వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. బిరాష్ట్రంలో నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. జిల్లాలోని పెద్దతండ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకుల వద్ద ఉదయం నుంచే వాహనదారులు భారీ క్యూలైన్లలో వేచి చూస్తున్నారు. గంటల తరబడి నిలబడినా ఇంధనం దొరకని





పరిస్థితి నెలకొంది. బిమహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ బంకుల లో డీజిల్ లేకపోవడంతో భారీగా నిలిచిపోయిన వాహనాలు. డీజిల్ కోసం పడిగాపు కాస్తున్న వాహనదారులు. పెట్రోల్ బంకుల వద్ద గంటలపాటు క్యూలో నిలబడిన వాహనదారులు. మహబూబాబాద్, బయ్యారం, గూడూరు, నెల్లికుదరు, కేసముద్రం మండలల్లో జాతీయ ప్రధాన రహదారి ల పై భారీగా నిలిచిపోయిన లారీలు, ట్రాక్టర్లు. పెట్రోల్ బంకుల వద్ద నో డీజిల్ బోర్డు ఏర్పాటుచేసిన బంకు యాజమాన్యాలు.

# భర్త సోదరినే రెండో భార్యగా చూపి.. కోర్టును మోసం చేసి విడాకులు!

- మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో వెలుగుచూసిన కేసు
- ఫ్యామిలీ ఫొటోను కోర్టుకు సమర్పించి తప్పుదోవ పట్టించిన వైనం
- విషయం తెలిసి హైకోర్టును ఆశ్రయించిన భర్త
- ఆమె వాదనను నమ్మి ఏకపక్షంగా విడాకులు మంజూరు చేసిన ఫ్యామిలీ కోర్టు

**గ్వాలియర్ ఏప్రిల్ 27 (నినాదం) :**

విడాకులు పొందేందుకు ఓ భార్య వేసిన పక్కా ప్లాన్ కోర్టునే విస్మయానికి గురిచేసింది. ఏకంగా తన భర్త సొంత చెల్లెలినే అతడి రెండో భార్యగా చిత్రీకరించి, ఫ్యామిలీ కోర్టును తప్పుదోవ పట్టించి ఏకపక్షంగా విడాకులు పొందింది. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగిన ఈ విచిత్ర ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అసలు విషయం తెలుసుకున్న భర్త, తనకు అన్యాయంగా మంజూరు చేసిన విడాకులను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయిం చాడు. వివరాల్లోకి వెళితే.. గ్వాలియర్‌కు చెందిన 40 ఏళ్ల మహిళకు 1998లో వివాహం జరిగింది. మార్కెటింగ్ కంపెనీలో పనిచేసే భర్త ఉద్యోగరీత్యా తరచూ బయట ప్రాంతాలకు వెళ్లేవాడు. ఈ క్రమంలో దంపతుల మధ్య విభేదాలు తలెత్తడంతో 2015 నుంచి ఇద్దరూ విడివిడిగా ఉంటున్నారు. అయితే, విడాకులు ఇచ్చేందుకు భర్త నిరాకరించాడు. దీంతో 2021లో సదరు మహిళ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తన భర్త మరో పెళ్లి చేసుకున్నాడని, అందుకే తనకు విడాకులు కావాలని పిటిషన్ వేసింది. ఇందుకు సాక్ష్యంగా భర్త తన సోదరి, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి దిగిన ఓ ఫ్యామిలీ ఫొటోను కోర్టుకు సమర్పించింది. అందులో ఉన్న తన ఆడపడుచునే భర్త రెండో భార్యగా చెప్పి కోర్టును నమ్మించింది. ఆమె సమర్పించిన ఆధారాలపై ఆధారపడిన ఫ్యామిలీ కోర్టు, ఆమెకు అనుకూలంగా ఏకపక్ష విడాకుల డిక్రీని మంజూరు చేసింది. ఈ నెల ఏప్రిల్ మొదటి వారంలో ఈ విషయం తెలుసుకున్న భర్త షాక్‌కు గురయ్యాడు. కోర్టు రికార్డులను పరిశీలించగా, తన భార్య చేసిన మోసం బయటపడింది. దీంతో ఆమె కోర్టును తప్పుదోవ పట్టించి అక్రమంగా విడాకులు పొందిందని ఆరోపిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టుకు చెందిన గ్వాలియర్ బెంచ్ లో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ కేసు త్వరలో విచారణకు రానుంది.




# మెదక్ హైవేపై కాలిబూడిదైన ప్రైవేట్ బస్సు.. తప్పిన పెను ప్రమాదం

- సురక్షితంగా బయటపడ్డ డ్రైవర్, క్లీనర్

**మెదక్ ఏప్రిల్ 27 (నినాదం) :**

మెదక్ జిల్లాలో జాతీయ రహదారి 44పై ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మాసాయిపేట వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగి, క్షణాల్లోనే పూర్తిగా దగ్ధమైంది. ఈరోజు తెల్లవారుజామున ఈ ఘటన జరిగినప్పుడు బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడం, డ్రైవర్, క్లీనర్ అప్రమత్తంగా వ్యవహరించి బయటకు దూకేయడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల వివరాల ప్రకారం, ఈ బస్సులో సాంకేతిక సమస్య తలెత్తడంతో మరమ్మతుల కోసం హైదరాబాద్ నుంచి మెదక్‌కు తీసుకొచ్చారు. రిపేర్ పూర్తయ్యాక సోమవారం తెల్లవారుజామున డ్రైవర్, క్లీనర్‌తో కలిసి హైదరాబాద్‌కు తిరుగు పయనమైంది. మాసాయిపేట సమీపించగానే ఇంజిన్ భాగం నుంచి పొగ, మంటలు రావడాన్ని డ్రైవర్ గమనించారు. వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేసి, క్లీనర్, డ్రైవర్ ఇద్దరూ కిందకు దూకేసి, సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గంటపాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే బస్సు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, మరమ్మతుల సమయంలో జరిగిన లోపమా? లేక షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



# పెట్రోల్ బంకుల వద్ద వాహనాల భారీ క్యూ

**వికారాబాద్, ఏప్రిల్ 27( నినాదం ):**

వికారాబాద్ జిల్లా లో సోమవారం పెట్రోల్ కొరత కారణంగా వాహనాలు పెట్రోల్ పంపుల వద్ద భారులు తీరాయి. కొన్ని బంకుల్లో పెట్రోల్ నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. దింతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురైయ్యారు. గత నెలలో కూడా పెట్రోల్ కుత్రిమ కొరతను సృష్టించి ప్రజలను ఇబ్బంది పెట్టిన సందర్భంలేకపోలేదు. అధికారులు కొరత లేదని స్పష్టం చేస్తున్న విధానం ప్రజలను అయోమయానికి గురించేస్తోంది. పెట్రోల్ నిల్వలపై అధికారులకు స్పష్టత లేదా లేక నిజంగానే కొరత ఉందా అనే అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసరాల్లో భాగమైన పెట్రోల్ విషయంలో అధికారులు స్పష్టమైన వివరణ ఇవ్వలేకపోతున్నారని పెట్రోల్ కుత్రిమ కొరతను సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంలో తాత్సరం జరుగుతోందని భావిస్తున్నారు. భవిష్యత్తులో పెట్రోల్ కొరత లేకుండా చూడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



# ఊరూరా ఎగిరిన బిఆర్ఎస్ జెండా

**హైదరాబాద్,ఏప్రిల్27( నినాదం):**

తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ జెండా పండుగ వాడవాడలా పండుగలా కొనసాగింది. తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా ఉద్యమ సంస్థగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని సాధించి, రాష్ట్రం పురోగతి సాధించిన గులాబీ జెండా 25 వసంతాలు పూర్తిచేసుకుని 26 వసంతంలోకి అడుపెట్టింది. తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ప్లలెలు, పట్నాలు, ఆయా ప్రాంతాల పార్టీల కార్యాలయాల్లో ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు గులాబీ జెండాలు ఎగరవేసి పటాకులు కాల్చి, స్వీట్లు పంచి పెట్టి సంబురాలు జరుపుకున్నారు. జైతెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు.

